నమస్తే తెలంగాణ

# ఆదిలాబాద్ - నిర్మల్

5 | నిజామాబాద్ మంగళవారం 21 జనవరి 2025 | ADILABAD NIRMAL




చికిత్స పొందుతున్న వారితో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

## ఆదివాసీ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి

**మాజీ మంత్రి జోగు రామన్న**

ఎదులాపురం, జనవరి 20 : రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన, గాయాలైన ఆదివాసీ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ మంత్రి జోగు రామన్న డిమాండ్ చేశారు. నార్నూర్ మండలంలో మలేపూర్ ఘాట్‌లో ఆదివారం ఐచర్ వాహనం బోల్తా పడ్డ ఘటనలో గాయాలైన వారు రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. సోమవారం రామన్న రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులతో మాట్లాడి, వారి ఆరోగ్య పరిస్థితిని రిమ్స్ డైరెక్టర్ డాక్టర్ జైసింగ్ రాథోడ్‌ను అడిగి తెలుసుకున్నారు. చనిపోయిన ఇద్దరి కుటుంబాలకు తీవ్ర సంతాపాన్ని ప్రకటించారు. ఆయన వెంట బీఆర్ఎస్ పార్టీ నాయకులు యూనిస్ అక్బాని, ఇజ్జగిరి నారాయణ, పరమేశ్వర్, బట్టు సతీశ్, మర్సకోల బాపూరావు, అల్లకొండ అశోక్, దేవదాస్, ఉగ్గే విఠల్, ఆత్రం వెంకట్, సాయి పాల్గొన్నారు.

## కలెక్టర్ తండ్రికి రిమ్స్‌లో కంటి ఆపరేషన్

ఎదులాపురం, జనవరి 20 : ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా తండ్రి బిమల్ కుమార్ షాకు రిమ్స్ వైద్యులు సోమవారం కంటి ఆపరేషన్ చేశారు. కొన్ని రోజులుగా కంటి సమస్యతో బాధపడుతున్న ఆయన రిమ్స్‌లో పరీక్షలు చేయించుకున్నారు. కాటరాక్ట్ ఆపరేషన్ అవసరం కాగా వైద్యులు ఆదర్శ, అనిశా, సౌమ్య, జాడి లింగేశ్‌లు ఆపరేషన్ నిర్వహించారు.



కలెక్టర్ తండ్రికి కంటి ఆపరేషన్ చేసిన రిమ్స్ వైద్యులు, సిబ్బంది



కుభీర్ మండలం చాత గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల కోసం సర్వే చేస్తున్న సిబ్బంది(ఫైల్)



నిర్మల్ శివారులోని గాజులపేట్ ప్రాంతంలో ప్లాట్లుగా మార్చిన భూములను సర్వే చేస్తున్న మున్సిపల్, రెవెన్యూ, వ్యవసాయ అధికారులు(ఫైల్)

# నిలదీతకు రెడీ

**రేషన్ జాబితాలపై న్యాయం కోసం గళమెత్తనున్న జనం**

- కొత్త కార్డుల కోసం జిల్లావ్యాప్తంగా 17,491 దరఖాస్తులు
- ప్రస్తుతం ఇచ్చేది మాత్రం 2,924 మందికే..
- ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కోసం పట్టణ కూలీల ఎదురు చూపు
- ఖాళీ స్థలాలు లేని నిరుపేదలకు ఇండ్లు లేనట్లేనా?
- సంక్షేమ పథకాల కేటాయింపుపై సర్వత్రా ఉత్కంఠ
- నేటి నుంచి 24వ తేదీ వరకు గ్రామసభలు

నిర్మల్, జనవరి 20(నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 26వ తేదీ నుంచి వివిధ సంక్షేమ పథకాలకు లబ్ధిదారులను ఎంపిక చేయనున్న నేపథ్యంలో అర్హులైన పేదలు తమకు అందుతాయో లేదో నన్న అయోమయంలో ఉన్నారు. సాగవుతున్న భూములకే రైతు భరోసా అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఆ మేరకు పంటలు సాగవుతున్న భూములను గుర్తించే పనిలో వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది నిమగ్నమయ్యారు. ఏడాదిలో ఒక్క పంట మాత్రమే పండే భూములు జిల్లాలో అధికంగా ఉన్నాయి. చాలా మంది గిరిజన రైతులు గుట్ట ప్రాంతాల్లో వానకాలంలో మాత్రమే పత్తి, సోయా వర్షాధార పంటలు వేస్తారు. సాగు నీటి సదుపాయం లేని భూముల్లో యాసంగి పంటలు వేయకుండా బీడుగా ఉంచుతారు. దీంతో వీరికి రెండు పంటలకు పెట్టుబడి సాయాన్ని ఇస్తారా? లేదా? ఒక పంటకే పరిమితం చేస్తారా? అన్న సందేహాలు రైతుల్లో వ్యక్తమవుతున్నాయి. గుట్ట ప్రాంతాలకు రైతుభరోసా ఇవ్వమని చెప్పిన ప్రభుత్వం.. మరి గుట్టలపైనే పంటలు పండించే గిరిజనులకు ఆర్థిక సాయం అందుతుందా? లేదా? అన్నది మంగళవారం నుంచి జరిగే గ్రామసభల్లో తేలనున్నది. ఇదిలా ఉంటే ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వంటి పథకాలు ఎవరికి అందుతాయన్న దానిపై కూడా నిర్మల్ జిల్లా వ్యాప్తంగా ఉత్కంఠ నెలకున్నది. ఆయా పథకాల కేటాయింపులో అధికారులు పారదర్శకత పాటిస్తారా? లేక పైరవీలకు పెద్దపీట వేస్తారా? అనే దానిపై చర్చ జరుగుతున్నది. ముఖ్యంగా రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న చాలా మంది పేదలు కొత్త కార్డుల ఎప్పుడు వస్తాయా? అని ఆశగా ఎదురు చూస్తున్నారు. ప్రాథమికంగా విడుదల చేసిన జాబితాలో చాలా మంది పేదల పేర్లు లేకపోవడంతో వారంతా నిరాశకు గురవుతున్నారు. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన సామాజిక, ఆర్థిక సర్వేలో అధికారులు కుటుంబాలకు సంబంధించిన అన్ని రకాల వివరాలను సేకరించారు. ఈ వివరాల ఆధారంగా జిల్లా వ్యాప్తంగా మొత్తం 17,491 కుటుంబాలు తమకు రేషన్ కార్డు లేనట్లు వెల్లడించారు. అయితే సర్వే అధికారులు వీరందరి వివరాలు నమోదు చేసుకున్నప్పటికీ ప్రస్తుతం ప్రకటించిన రేషన్ కార్డుల అర్హుల జాబితాలో వారి పేర్లు లేకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారు. సమగ్ర సర్వే వివరాల ప్రకారం 17,491 మంది కుటుంబాలను సర్వే చేసి అర్హులైన వారిని గుర్తించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. అయితే



భైంసా మండలం వానల్‌పాడ్‌లో రైతుభరోసా కోసం భూముల సర్వే చేస్తున్న వ్యవసాయ అధికారులు, సిబ్బంది(ఫైల్)

మండల స్థాయి అధికారులు, సిబ్బంది తూతూ మంత్రంగా సర్వేను పూర్తి చేసి కేవలం 2,924 మంది పేర్లతో జాబితాను సిద్ధం చేయడంపై అర్హులైన నిరుపేదలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా.. ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు నాలుగు రోజులపాటు నిర్వహించే గ్రామ సభలు, వార్డు సభల్లో చర్చించి మరోసారి అర్హులైన లబ్ధిదారుల జబితాను రూపొందించే అవకాశం ఉన్నదని అధికారులు చెబుతున్నారు. పథకాలకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ నిరంతర ప్రక్రియ అని అధికారులు చెబుతున్నప్పటికీ, ప్రజల్లో మాత్రం ఆందోళన నెలకొన్నది. ఈ నేపథ్యంలో పథకాలు అందని వారు గ్రామసభల్లో తమ గళాన్ని వినిపించి న్యాయం చేయాలని డిమాండ్ చేసే అవకాశమున్నది.

### ఇందిరమ్మ ఇండ్ల కోసం 1.92 లక్షల దరఖాస్తులు

జిల్లావ్యాప్తంగా ఇందిరమ్మ ఇండ్ల కోసం 1,92,233 దరఖాస్తులు వచ్చాయి. నిర్మల్ పట్టణం జిల్లా కేంద్రంగా మారిన తర్వాత వేగంగా అభివృద్ధి చెందింది. విద్య, వైద్యం తదితర మెరుగైన సదుపాయాలతోపాటు ఉపాధి అవకాశాలు కూడా పెరగడంతో వివిధ ప్రాంతాల నుంచి నిర్మల్‌కు వచ్చి స్థిరపడే వారి సంఖ్య కొంతకాలంగా గణనీయంగా పెరిగింది. దీంతో ఇందిరమ్మ ఇండ్ల కోసం ఒక్క నిర్మల్ మున్సిపాలిటీ పరిధి నుండే 19,323 దరఖాస్తులు వచ్చాయి. అలాగే భైంసా మున్సిపాలిటీ పరిధిలో 12,711, ఖానాపూర్ మున్సిపాలిటీ పరిధిలో 4,130 దరఖాస్తులు వచ్చాయి. ఇక గ్రామీణ ప్రాంతాల నుంచి కూడా ఇందిరమ్మ ఇండ్ల కోసం పెద్ద సంఖ్యలోనే దరఖాస్తు చేసుకున్నారు. భైంసా మండలం నుంచి 11,858, కడెం నుంచి 11,178, దస్తురాబాద్ నుంచి 4,937, లోకేశ్వరం నుంచి 9,139, ఖానాపూర్ నుంచి 8,404, సారంగాపూర్ నుంచి 13,039, దిలావర్‌పూర్ నుంచి 5,857, ముథోల్ మండలం నుంచి 9,374 దరఖాస్తులు వచ్చాయి. అలాగే నర్సాపూర్(జి) నుంచి 6,564, సోన్ నుంచి 6,723, పెంబి నుంచి 4,460, కుంటాల నుంచి 6,557, లక్ష్మణచాంద నుంచి 7,893, మామడ నుంచి 9,629, కుభీర్ నుంచి 15,026, నిర్మల్ మండలం నుంచి 7,331, తానూర్ నుంచి 12,432, బాసర నుంచి 5,668 దరఖాస్తులు వచ్చాయి. అయితే జిల్లావ్యాప్తంగా ఇండ్ల కోసం ఇంత పెద్ద ఎత్తున దరఖాస్తులు రాగా, అధికారులు మాత్రం ప్రభుత్వ ఆదేశాల మేరకు నియోజకవర్గానికి 3,500 ఇండ్లు మాత్రమే మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం. అది కూడా సొంత స్థలాలు ఉన్న వారికే ఇండ్లను మంజూరు చేయనున్నారు. దీంతో సొంతంగా ఖాళీ స్థలాలు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు దక్కే అవకాశం లేకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### ఆత్మీయ భరోసా కొందరికేనా?

భూమి లేని వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12 వేలు అందించే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం జిల్లాలో అందరికీ అందే అవకాశాలు కనిపించడం లేదు. ఉపాధి హామీ పథకంలో జాబ్‌కార్డు కలిగి ఉండి, ఏడాదిలో కనీసం 20 రోజులు ఉపాధి పనికి వెళ్లిన వారికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందజేయనున్నారు. ఇలా జిల్లా వ్యాప్తంగా 87,781మంది జాబ్ కార్డులు కలిగి ఉండి 20 రోజుల పనిదినాలను పూర్తి చేసిన వారున్నారు. అయితే ఈ పథకాన్ని కేవలం గ్రామీణ ప్రాంత కూలీలకే వర్తింపజేయడంతో పట్టణ ప్రాంతాల్లో నివసించే పేదలకు ఈ సహాయం అందకుండా పోతున్నది. అంతే కాకుండా ఇటీవల కొన్ని గ్రామాలు నిర్మల్ మున్సిపాలిటీలో విలీనం కావడంతో ఆయా గ్రామాల్లోని నిరుపేద కూలీలకు పథకం వర్తించే అవకాశాలు లేవు. దీంతో చాలా మంది పేదలు నష్టపోయే అవకాశం ఉన్నది. పల్లెలతోపాటు పట్టణాల్లోని వ్యవసాయ కూలీలకు కూడా ఈ పథకాన్ని వర్తింపజేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఇలా ప్రతి పథకంలోనూ అర్హుల సంఖ్య పెద్ద సంఖ్యలో ఉండడం, ప్రభుత్వం ఇచ్చేవి అరకొరగా ఉండడంతో మంగళవారం నుంచి జరిగే గ్రామ సభలు సజావుగా సాగుతాయా లేదా అన్న అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.





ఆదిలాబాద్ ఎంఈవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

## వంట కార్మికులకు రూ.10 వేల వేతనం ఇవ్వాలి

ఎదులాపురం, జనవరి 20 : కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం వంట కార్మికులకు రూ.10 వేల వేతనం అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కుంటాల రాములు డిమాండ్ చేశారు. సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికులు ఎంఈవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ఎంఈవో సోమేశ్వర్‌కు వినతి అందజేశారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ జానకి షర్మిల

## బ్యాంకుల భద్రతకు పటిష్ట చర్యలు చేపట్టాలి

**నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల**

నిర్మల్ చైన్‌గేట్, జనవరి 20 : బ్యాంకుల భద్రతకు ఆయా బ్యాంకు అధికారులు పటిష్ట పర్చుకోవాలని ఎస్పీ జానకి షర్మిల అన్నారు. జిల్లాలో ఏ బ్యాంక్‌లో కూడా దొంగతనం జరగొద్దనే ఉద్దేశంతో అన్ని బ్యాంకు అధికారులతో సోమవారం ఎస్పీ పోలీసు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ.. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఖాతాదారులతో లావాదేవీలు నిర్వహిస్తున్న వివిధ శాఖలకు చెందిన ఆయా బ్యాంకులు బ్యాంకుల భద్రత చర్యలను తీసుకోవాలన్నారు. ఏటీఎంల వద్ద భద్రత పటిష్ట పరచాలన్నారు. భద్రతా పరమైన సూచనలకు సంబంధించిన పోస్టర్లు అతికించాలన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. పోలీసు అధికారులందరు వారి పరిధిలోని వివిధ శాఖలకు చెందిన బ్యాంకులను ఆకస్మాత్తుగా సందర్శించాలని, బ్యాంకు పరిసరాల చుట్టూ ప్రాంతాలు, బ్యాంకు లాకర్ల పని తీరుని బ్యాంకుల మేనేజర్లతో కలిసి పరిశీలించాలన్నారు. బ్యాంకుల భద్రత చర్యలపై మేనేజర్ అకౌంటెంట్ సిబ్బందికి తగు సూచనలు, సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఉపేందర్‌రెడ్డి, రాజేశ్‌మీనా, లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్‌గోపాల్ పాల్గొన్నారు.



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్ శ్యామలదేవి

## రైతు కుటుంబాన్ని పరామర్శించిన కలెక్టర్

బేల, జనవరి 20 : ఐసీఐసీఐ బ్యాంకులో గత శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న రేణిగూడకు చెందిన రైతు జాదవ్ దేవ్‌రావు కుటుంబాన్ని సోమవారం కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవితో కలిసి పరామర్శించారు. బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క ఆదేశాల మేరకు రైతు కుటుంబాన్ని పరామర్శించి, ఆత్మహత్యకు గల కారణాలను అడిగి తెలుసుకుని, ప్రభుత్వపరంగా అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు

నిర్మల్ చైన్‌గేట్, జనవరి 20 : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేందుకు మంగళవారం నుంచి ఈనెల 24వ తేదీ వరకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ ఇండ్లు, నూతన ఆహార భద్రత కార్డులు, రేషన్‌కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల లబ్ధిదారుల ఎంపికకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామసభల నిర్వహణకు ప్రత్యేక అధికారులను నియమించి అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామన్నారు. లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉంటుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలను అందించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ప్రకటనలో పేర్కొన్నారు.



కలెక్టర్ అభిలాష అభినవ్

## రైతు ఆత్మహత్యలపై బీఆర్ఎస్ అధ్యయనం

**కమిటీ సభ్యుడిగా మాజీ మంత్రి జోగు రామన్న**

ఆదిలాబాద్, జనవరి 20(నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో జరుగుతున్న రైతు ఆత్మహత్యలపై అధ్యయనం చేయడానికి బీఆర్ఎస్ కమిటీని ఏర్పాటు చేసింది. మాజీ వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ కమిటీలో ఆదిలాబాద్ జిల్లాకు చెందిన మాజీ మంత్రి జోగు రామన్నకు స్థానం లభించింది. మాజీ మంత్రులు జోగు రామన్న, పువ్వాడ అజయ్, సత్యవతి రాథోడ్.. ఎమ్మెల్సీలు ఎంసీ కోటిరెడ్డి, యాదవరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, రసమయి బాలకిషన్, అంజయ్య యాదవ్‌లు సభ్యులుగా ఉన్నారు. తొమ్మిది మంది సీనియర్ నాయకులతో ఏర్పాటైన కమిటీ రెండు వారాలపాటు రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో పర్యటిస్తుంది. పెరుగుతున్న రైతు ఆత్మహత్యలు, దుర్భర వ్యవసాయ పరిస్థితులపై అధ్యయనం చేస్తుంది. అనంతరం నివేదికను తయారు చేసి రాష్ట్ర ప్రభుత్వానికి, వ్యవసాయశాఖ మంత్రికి, కమిషనర్‌కు, బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్‌కు నివేదికను అందజేస్తారు. జిల్లాలో రైతుల సమస్యలపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న ఆధ్వర్యంలో పలు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. ఆదిలాబాద్ నియోజకవర్గంలో జైనథ్, బేల, ఆదిలాబాద్ మండలాల్లో రాస్తారోకోలు చేపట్టి రైతు భరోసా పథకంలో భాగంగా ఎకరాకు రూ.15 వేలు, అర్హులైన రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ, కౌలు రైతులతోపాటు రైతు కూలీలకు ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక సాయం అందజేయాలని డిమాండ్ చేశారు.



మాజీ మంత్రి జోగు రామన్న

## జాతీయ మారథాన్ విజేత కిరణ్‌కుమార్

ఖానాపూర్ టౌన్, జనవరి 20 : నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు అయిల్నేని కిరణ్ కుమార్ ముంబయిలో నిర్వహించిన జాతీయస్థాయి మారథాన్ పోటీల్లో విజేతగా నిలిచాడు. ఈ నెల 19న రాత్రి టాటా సంస్థ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన ఈ మారథాన్ పోటీల్లో దేశ నలుమూలల నుంచే కాకుండా విదేశాల నుంచి మారథాన్‌లో ఉత్సహంగా పాల్గొన్నారు. గతంలో కరీంనగర్‌లో నిర్వహించిన ఎంపిక పోటీల్లో పాల్గొని అర్హత సాధించడంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. దాదాపు 60వేల మంది పాల్గొన్న ఈ మారథాన్‌లో తెలంగాణకు చెందిన కిరణ్‌కూమార్ 42 కిలోమీటర్ల దూరాన్ని 5 గంటల 31 నిమిషాల్లో గమ్యం చేరి విజేతగా నిలిచాడు. ఈ పోటీల కొరకు ఆరు నెలలుగా ఖానాపూర్ నుంచి పెంబి, దస్తురాబాద్, మల్లాపూర్, మామడ మండలాల వరకు మిత్రులతో కలిసి మారథాన్ నిర్వహించారు. జాతీయ స్థాయిలో విజేతగా నిలిచిన కిరణ్ కూమార్ భవిష్యత్‌లో విదేశాల్లో నిర్వహించే మారథాన్‌లో పాల్గొనే అవకాశం ఉంది.





కిరణ్ కుమార్

## సీఎంఆర్ ప్రక్రియను పూర్తి చేయాలి

**అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్**

నిర్మల్ చైన్‌గేట్, జనవరి 20 : కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్ రైస్ మిల్లర్లను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సీఎంఆర్ సరఫరాపై సంబంధిత అధికారులు, రైస్ మిల్లర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. సీఎంఆర్ సరఫరాలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సీఎంఆర్ లక్ష్యం, పూర్తి చేసిన సరఫరా, నిల్వ ఉన్న ధాన్యం, రోజువారీగా తరలిస్తున్న ధాన్యపు లారీల వివరాలను మిల్లర్లవారీగా సమీక్షించారు. రెవెన్యూ, సివిల్ సప్లయ్ అధికారులు క్షేత్ర స్థాయిలో మిల్లులను తనిఖీ చేసి సీఎంఆర్ ప్రక్రియ తీరు, మిల్లులో ధాన్యం అన్‌లోడింగ్ అంశాలను పరిశీలించి రోజువారి నివేదికలను అందజేయాలన్నారు. ఈ సమావేశంలో డీఎస్‌వో కిరణ్‌కుమార్, డీఎం సివిల్ సప్లయ్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

## తాగునీటి సమస్యను పరిష్కరించాలని నిరసన

- ఎమ్మెల్యే బొజ్జు బోర్లు వేయిస్తామని వేయించలేదు..
- అధికారుల దృష్టికి తీసుకెళ్లిన స్పందించడం లేదు..
- మున్సిపల్ కమిషనర్‌కు వినతి

ఖానాపూర్, జనవరి 20 : మున్సిపల్ కార్యాలయం ఎదుట డబుల్ బెడ్రూం ఇండ్లలో నివాసం ఉంటున్న పలువురు తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ సోమవారం నిరసన చేపట్టారు. కొన్ని నెలల నుంచి సీ5, సీ6 బ్లాక్‌లో బోరు లేకపోవడంతో తాగు నీటి కష్టాలు తీవ్రమైనట్లు మహిళలు నిరసన తెలిపారు. మిషన్ భగీరథ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు డబుల్ బెడ్రూం ఇండ్ల కోసం మూడు బోర్లు వేయిస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఇంతవరకు ఉసేలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపాలిటీలోని 12 వార్డుల అభివృద్ధి కోసం కేటాయించిన నిధులతో తమ బ్లాకుల్లో తాగు నీటి సమస్యను పరిష్కరించాలని వేడుకున్నారు. ఈ సమస్యపై కౌన్సిలర్లు, ఉన్నాతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి తాగు నీటి ఎద్దడి నివారించాలని మున్సిపల్ కమిషనర్ మనోహర్‌కు వినతి పత్రం అందజేశారు. ఇక్కడ నంది రామయ్య, సౌజన్య, విజయలక్ష్మి, మల్లవ్వ, గంగామణి, ప్రమీల, జమీల బేగం, డబుల్ బెడ్రూం కాలనీ వాసులు ఉన్నారు.



ఖానాపూర్ మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న డబుల్ బెడ్రూం కాలనీవాసులు